# అమ్మా... నన్ను మన్నించు!

– కాకాని కమల

తల్లి దగ్గర్నించి వచ్చిన ఉత్తరం విప్పి చదవసాగాడు రాజేష్. అందులో ఏం విషయం ఉంటుందో అతనికి తెలియంది కాదు. అయినా తల్లి రాసిన ఉత్తరం చదవకుండా ఎలా ఉండగలడు?

“నాయనా... రాజా... నా కన్నలూ... ఎలా ఉన్నావురా! క్షేమంగా ఉన్నావని తలుస్తాను. నువ్వు మాకందరికీ అంత దూరంగా ఒంటరిగా ఎలా ఉంటున్నావో అనే నా ఆలోచన. ఈ మధ్య మరీ ఎక్కువగా తాగుతున్నావని తెలిసింది. సిగరెట్లు కూడా బాగా ఎక్కువగా పీల్చేస్తున్నావని, రోజుకి రెండు పెట్టెలు ఖాళీ చేస్తున్నావని తెలిసింది. నాయనా రాజా... నువ్వు ఎంత గొప్ప చదువులు చదివావు. విజ్ఞాన ఖనివి. అలాంటి నీకు నేను ఏం చెప్పగలను. అన్నీ తెలిసి నీ ఆరోగ్యం పాడుచేసుకుంటున్నావు. మనసు పాడు చేసుకుంటున్నావు. జరిగిన దాన్ని గురించి ఎన్నాళ్లు బాధపడతావు. అందువల్ల వచ్చిన లాభం ఏదన్నా ఉందా? ఎన్నో పీడ కలలు వస్తుంటాయి, పోతుంటాయి. ఆ క్షణం భయం వేస్తుంది. కాని అది శాశ్వతమా? తరువాత నిద్రపోమా! మళ్లీ మంచి కలలు రావా?

జీవితం అన్నాక ఆటాపాటా తప్పదు. నవ్వు, దుఃఖం తప్పదు. జరిగింది మర్చిపో. హాయిగా మళ్లీ పెళ్లి చేసుకో. నీ కోసం చక్కటి అమ్మాయిని వెదికి పెట్టాను. లేదా నీకు అక్కడ ఎవరన్నా అమ్మాయి నచ్చితే, ఆ అమ్మాయిని చేసుకో. మాకు నువ్వు ఒక్క కొడుకువి. నీ జీవితం అలా దారితప్పితే మాకెంత మనోవేదనో అర్థం చేసుకో. ఆ తాగుడు, సిగరెట్లు లాంటి చెడు అలవాట్లన్నీ మందు మానెయ్యి. నీ మీదే ఆశలన్నీ పెట్టుకున్నదాన్ని. నేను ఏమైపోవాలిరా రాజా... గతాన్ని మర్చిపో. కొత్త జీవితాన్ని ప్రారంభించు... ఈ వయసులో నన్ను క్షోభ పెట్టకురా నాన్నా...”

ఆశీస్సులతో మీ అమ్మ
సీతామహాలక్ష్మి వ్రాలు.

- - - - - -

రాజేష్‌కి మంచి స్ఫురద్రూపం ఉంది. మంచి చదువు, ఉద్యోగం ఉంది. ఒక్కడే కొడుకు. అంతో ఇంతో ఆస్తి ఉంది. చదువుకోగానే మంచి సంబంధం అని చెప్పి పెళ్లి చేశారు. వారి మధ్యవర్తి లోపాయికారి చేశాడో, లేక ఎక్కడ తప్పటడుగు పడిందో తెలియదు.

ఎంతో ఘనంగా రాజేష్ పెళ్లి అమూల్యతో జరిగింది. ఇద్దర్నీ చూసిన పెళ్లిపెద్దలందరూ చూడచక్కని జంట... ‘మేడ్ ఫర్ ఈచ్ అదర్’ అన్నారు.

కాని పెళ్లి అయిన నాలుగు నెలలకే అమూల్య వెళ్లిపోయింది. ఆమెకి అంతకుముందే ప్రేమ వ్యవహారం ఉందిట. ఆ అబ్బాయి వీళ్ల కులస్తుడు కాదని ఇంట్లో తల్లీ తండ్రీ ఇష్టపడలేదుట. అతడు ప్రాజెక్టు పని మీద కెనడా వెళ్లిన సమయం చూసి అమూల్య మెడలు వంచి రాజేష్‌తో పెళ్లి జరిపించారుట. ఆ విషయాలేవీ రాజేష్‌కి గాని, అతడి తల్లిదండ్రులకి గాని తెలియలేదు. పెళ్లి కాగానే అమూల్య నాలుగు రోజులు అత్తింట్లో వుండి, తిరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు నెలల తరువాత కాపురానికి పంపుతామని, అది వాళ్ల ఆచారం అని, అప్పుడే గదిలోకి పంపే కార్యక్రమం అని అమూల్య తల్లీ తండ్రీ చెప్పారు. కాని అమూల్య మొండి వైఖరి వల్ల అలా చెప్పారని తరువాత తెలిసింది. అమూల్య పెళ్లి అయిన నాలుగు నెలలకి కెనడా వెళ్లిన ఆమె ప్రియుడు నళినీధర్ ఇండియాకి వచ్చాడు. 20 రోజులు ఇండియాలో ఉండి తిరిగి కెనడాకు వెళ్లాడు మళ్లీ ఇంకొక ఆరు నెలల ప్రాజెక్టు గురించి. అయితే



ఈసారి అతడు ఒంటరిగా వెళ్లలేదు. అమూల్యని రిజిస్టర్ పెళ్లి చేసుకుని వెంట తీసుకుని వెళ్లాడు.

అంతే...!

ఆ వార్త అశనిపాతంలా రాజేష్ కుటుంబాన్ని కుదిపేసింది. తలమీద పిడుగు పడినట్లుగా చలించిపోయాడు రాజేష్. అవమానంతో అతడి హృదయం జ్వలించిపోయింది. ఒక్కగానొక్క కొడుకు జీవితం ఇలా అయిందని ఇంటిల్లిపాది కృంగిపోయారు.

ఈ సంఘటన జరిగి నాలుగేళ్లు దాటుతోంది. ఈ నాలుగేళ్లలో చాలా మార్పులు జరిగాయి. రాజేష్ తండ్రి మరణించాడు. ఉద్యోగరీత్యా రాజేష్ బాంబే వచ్చేశాడు. తల్లి అన్నగారింట ఉంటోంది.

సున్నితమైన మనసుకి ఏ మూలో మాయని గాయం అయ్యింది రాజేష్‌కి. చచ్చిపోవాలనిపించిన క్షణాలు ఎన్నో. 'నీకేంటిరా మగాడివి. మళ్లీ పెళ్లి చేసుకో' అంటున్నారు బంధువులు. తల్లి సరేసరి! కొడుకు కోసం బెంగపడి మంచం పట్టింది. కాని ఎందుకో రాజేష్‌కి మళ్లీ పెళ్లి మీద ఆలోచన లేదు. అతడి హృదయం గాయపడింది. ఆ గాయం మానదు. తాగుడుకి బానిస అయ్యాడు. ఆ మత్తులో అన్నీ మరిచిపోతున్నాడు. అలా వున్నా అతని పరిస్థితి బాగానే ఉండేది. కాని ఆమధ్య ఒక సంఘటన జరిగింది. రాజేష్ మనసు బాగోక ఆఫీసు అయిపోగానే బీచ్‌కి వెళ్లాడు. ఆనందం కోసం, ప్రశాంతత కోసం బీచ్‌కి వెళ్లాడు. కాని అతడి మనసు ముక్కలు చేసే సంఘటన జరిగింది.

రాజేష్ వెళ్లి కూర్చున్న కాసేపటికి ఎ.సి. కార్లోంచి ఒక అందాల జంట దిగింది. ఆ జంట ఎవరో కాదు... అమూల్య-నళినీధర్! ఎంతో స్టయిల్‌గా ఉన్నారు ఇద్దరూ. ఇద్దరూ చేతులు పట్టుకుని నడుస్తూ బీచ్‌లో ఉన్న రెస్టారెంట్ వైపు వెడుతుంటే రాజేష్ హృదయం భగ్గుమంది. పెట్రోలు పోసి ముట్టించినట్లు రగిలిపోయింది. వెంటనే లేచి ఇంటికి వచ్చాడు. ఆ రాత్రంతా తాగుతూనే ఉన్నాడు. అతడి మనసు మళ్లీ గాయపడింది. దెబ్బపై దెబ్బ! ఈ సంఘటన జరిగి ఏడెనిమిది నెలలు అవుతోంది. అయినా అనుక్షణం రాజేష్ కళ్లముందు కదులుతోంది. అతను పిచ్చివాడు అయిపోతున్నాడు. విపరీతమైన టెన్షన్‌కి గురి అవుతున్నాడు. ఆ మనోవేదన భరించలేక తాగుడులోనే గడుపుతున్నాడు. పగలూ-రాత్రీ ఆ బాధ మర్చిపోవాలంటే ఆ మత్తు అతడికి తప్పనిసరి అయింది. తల్లి మళ్లీ పెళ్లి చేసుకోమంటుంది. కాని ఎలా చేసుకోగలడు. కాలుకి దెబ్బ తగిలింది. అది కుళ్లింది. దాన్ని సగందాకా తీసేస్తాడు వైద్యుడు. ఆ కుంటి కాలితో తిన్నగా నడవగలమా? మనసైనా అంతే కదా! అలాగే ఆలోచిస్తోంది అతడి హృదయం.

- - - - -

రాజేష్ ఉత్తరం మడిచి సొరుగులో వేశాడు.

తల్లి అంటే ప్రేముంది. ఆవిడ మనోవేదనని అర్థం చేసుకోగలడు. కాని తను ఆవిడ కోర్కెని మన్నించలేడు.

"అమ్మా... నన్ను మన్నించు!' అనుకున్నాడు వేదనగా సిగరెట్టు వెలిగించి, కొత్త బాటిల్ తెరుస్తూ...